శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహణ

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 12, ప్రభాతవార్త** ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ మీకోసం.ఏపి.జిఓవి.ఇన్ ద్వారా నమోదు చేసుకోవచ్చును. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చును. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, అక్టోబరు 12, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 16933 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 73.807 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 0, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టాకు 0, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 100.009 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు వైద్యశాలపై చర్యలేవి..?

- వైద్యుల ఫీజుల వివరాలను బోర్డులలో ప్రకటించరా..?
- పొల్యూషన్, అగ్నిమాపక శాఖ అనుమతులు అన్ని వైద్యశాలలకు ఉన్నాయా
- నూతనంగా నిర్మిస్తున్న ప్రైవేటు వైద్యశాలల నిర్వాహకులు అన్ని అనుమతులు పొందారా..?





**నెల్లూరు, అక్టోబర్ 12, ప్రభాతవార్త-వైద్యం :** నెల్లూరు నగరంలో ప్రైవేటు వైద్యశాలల డాక్టర్ల ఫీజుల వివరాలను తమ వైద్యశాలల్లో బోర్డులు ఏర్పాటు చేసి ప్రకటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి వి.సుజాత ఆదేశించి మూడు నెలలు గడుస్తున్నా, ఇప్పటికి నగరంలో ఉన్న ఏ ప్రైవేటు వైద్యశాలలోనూ అలాంటి బోర్డులు ఎక్కడా కనిపించడం లేదు. వైద్యుల నిర్లక్ష్యంతో కూడిన ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహారించాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేసే వైద్యశాలలపై కొరడా ఝులిపించాల్సిన అవసరం ఉంది. వ్యాధిని బట్టి రోగుల నుంచి ఇష్టానుసారం ఫీజులు వసూళ్లు చేస్తూ తమ వైద్యశాలల్లోనే ఫార్మసీ ని కూడా ఏర్పాటు చేసుకుని వాటిపై కూడా పరిమితికి మించి మందుల ధరలపై డబ్బులు వసూళ్లు చేసే పరిస్థితులు నగరంలో కోకొల్లలుగా కనిపిస్తున్నాయి. మందుల ధరలు, ఇంజక్షన్ ధరలు తెలియక ప్రైవేటు వైద్యశాలలకు వచ్చిన రోగులు అన్ని విధాలా నష్టపోతున్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలకు ఇతర జిల్లాల నుంచి కూడా రోగులు, ఇక్కడ నుంచి వైద్యం అందుతుందన్న నమ్మకంతో నెల్లూరు వైద్యులను సంప్రదిస్తుంటారు. ఎంతో నమ్మకంతో వచ్చే రోగులు విపరీతమైన ఫీజుల దోపిడీకి, మందుల ఇంజక్షన్ల ధరల దోపిడీకి గురవుతున్నారు. ఒక వ్యాధికి ఒకటో రెండో మందులు వేస్తే సరిపోతుంది. కానీ అలాంటి పరిస్థితులు ఎక్కడ కనిపించవు. ఒక వ్యాధి సోకిన వ్యక్తికి వైద్యులు ఐదు ఆరు రకాల మందులను అంటగడతారు. అంటే వైద్యుడు రాసిన 5, 6 రకాల మందులలో ఏదో ఒక మందు ఆ వ్యాధిని తగ్గిస్తుందన్న ఆలోచనతో వైద్యులు ఈ విధానాన్ని అనుసరిస్తారు. అంత వరకు భాగానే ఉన్నా ఈ ఐదు ఆరు రకాల మందు బిళ్ళలు వేసుకున్న రోగి మరింత కుంగిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో మరో మారు ఆ వైద్యుని సంప్రదిస్తే అవి కాకుండా కాస్ట్లీ మందులంటూ వేరే రకం మందులను రోగికి అంటగట్టి తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా నెల్లూరు వైద్యులు కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు నెల్లూరులోని కొన్ని సూపర్ స్పెషాలిటీ వైద్యశాలల్లో శవాలకు వైద్య సేవలు అందించి రోగుల నుంచి లక్షల్లో నగదు వసూళ్లు చేసిన సందర్భాలు కోకొల్లలుగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పేద, మధ్య తరగతి ప్రజలు నష్టపోకుండా ప్రైవేటు వైద్యశాలల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు ఎంత వరకు అనుసరిస్తున్నారో, ఏఏ అనుమతులు కలిగి ఉన్నారో ప్రభుత్వ యంత్రాంగం పరిశీలించాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా నగరంలో సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలు, కాన్పులు గర్భకోశ వ్యాధుల వైద్యశాలలు, ఐవీఎఫ్ సెంటర్లు నూతనంగా అనేకం వెలుస్తున్నాయి. అలాంటి వైద్యశాలలు ఆంధ్రప్రదేశ్ అల్లోపతి క్లినికల్ కేర్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2002 ప్రకారం నమోదు చేసుకున్నారా..? లేదా..? తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉంది. నూతనంగా వెలుస్తున్న ఈ వైద్యశాలల్లో ఫైర్, పొల్యూషన్, బయో మెడికల్ వేస్టేజీ అనుమతులు ఉన్నాయా లేదా అనే కోణంలో తప్పక పరిశీలన చేయాల్సి ఉంది. వైద్యం కోసం నెల్లూరుకొచ్చిన పేదలు నష్టపోకుండా ఆయా వైద్యశాలల అనుమతులను పరిశీలించి, పేద ప్రజలు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఆదేశాలను పక్కన పెట్టి, ఫీజుల వివరాలను తమ వైద్యశాలల్లో పొందుపరచని ఆసుపత్రులపై కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించిన టీడీపీ నేతలు



**వరికుంటపాడు, అక్టోబర్ 12, ప్రభాతవార్త** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని వరికుంటపాడు మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు టీడీపీ మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్‌రావు, జడ్పీటీసీ రావిళ్ళ నాగేంద్ర, సొసైటీ అధ్యక్షులు గుర్రం గోపి, క్లస్టర్ ఇన్‌చార్జి పోకా మహేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, మండల తెలుగు యువత అధ్యక్షులు లక్ష్మీ నారాయణ, మండల వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, యూనిట్ ఇన్‌చార్జి నాదెండ్ల రాజా, మాజీ సర్పంచ్ ఆంద్రా బాల గురవారెడ్డి, యువ నాయకులు ఆరికొండ వెంకటరత్నం ఆదివారం నెల్లూరులోని ఆయన అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పుష్పగుచ్ఛంలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు మండలంలో జరిగిన ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ తీసుకొచ్చినందుకు నాయకులను అభినందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టనున్నటువంటి అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసే విధంగా చూడాలని శాసనసభ్యులు కాకర్ల సురేషన నియోజకవర్గ ప్రజల కోసం చాలా కష్టపడుతున్నాడని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు.

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన భాధ్యత ఉపాధ్యాయులదే



**రాపూరు, అక్టోబరు 12, ప్రభాతవార్త** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన భాద్యత ఉపాధ్యాయుల దేనని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలో డియస్సీ 2025లో ఉపాధ్యాయులుగా ఎంపికై సోమవారం బాద్యతులు స్వీకరించనున్న 65 మంది ఉపాధ్యాయులను ఆయన ఆదివారం వెంకటగిరిలోని కార్యలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న కీలక నిర్ణయాలలో బాగంగా మోగా డిఎస్సీని ప్రకటించి 16 వేల మంది ఉపాధ్యాయులను నియమించడం జరిగిందన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో సుమారు 65 మందికి పైగా ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులగా నియమితులైన వారు విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్ది నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సందర్బంగా రాపూరు మండలానికి చెందిన 15 మంది ఉపాధ్యాయులకు శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు. జిల్లా స్థాయిలో, జోనల్ స్థాయిలో హిందీ పండిట్‌లో ప్రథమ స్థానం సాధించిన సయ్యద్ షబ్‌నాజ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రాపూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి, తిరుపతి పార్లమెంట్ మైనారిటీ ఉపాధ్యక్షుడు షేక్ ముక్తియార్, మండల విద్యాశాఖాధికారి గుండవోలు శ్రీనివాసులు తదితరులున్నారు.

# అర్ధరాత్రి హోటల్‌లో అగ్ని ప్రమాదం

## రెస్క్యూ ఆపరేషన్‌ను దగ్గరుండి పర్యవేక్షించిన ఎస్పీ





**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** స్థానిక కె.వి.ఆర్ సర్కిల్ ప్రాంత సమీపంలో ఉన్న బ్లూ మూన్ లాడ్జిలో శనివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు స్వయంగా సంఘటన స్థలికి వచ్చి సిబ్బంది చేపట్టిన రిస్క్యూ ఆపరేషన్ సిబ్బంది చేపట్టిన రిస్క్యూ ఆపరేషన్‌ను దగ్గరుండి పర్యవేక్షించడం గమనార్హం. పోలీసుల కథనంతో పాటు సేకరించిన సమాచారం శనివారం రాత్రి దర్గామిట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉమెన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ భాస్కర్ రౌండ్స్ డ్యూటీ నిర్వహిస్తున్నప్పుడు, బ్లూ మూన్ లగ్జరీ రూమ్స్ లాడ్జ్‌ను చేరుకోగా, లాడ్జ వాచ్ మెన్ పరిగెత్తుకుంటూ వచ్చి, లాడ్జ్‌లో అగ్ని ప్రమాదం సంభవించినట్లు తెలియజేశాడు. తక్షణమే, రాత్రి రౌండ్స్ అధికారి ఉన్నతాధికారులకు, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే జిల్లా ఎస్పీ, సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సంఘటన స్థలానికి చేరుకొని, స్వయంగా పరిస్థితులను పరిశీలిస్తూ, తగిన సూచనలు చేస్తూ, పర్యవేక్షించారు. ఆ సమయంలో, లాడ్జ్‌లో తొమ్మిది గదుల్లో మొత్తం 14 మంది వ్యక్తులు ఉన్నారు. ఫైర్ డిపార్ట్మెంట్ సిబ్బంది సహాయంతో, లోపల ఉన్న అందరు వ్యక్తులను సురక్షితంగా రక్షించి, లాడ్జ్ నుండి బయటకు తీసుకువచ్చారు. రూమ్ నంబర్ 301లో సత్యనారాయణ అతని భా ర్యఅభిప్సా మిశ్రా, కుమారుడు శ్రీజయ్ వృస్తి వ్యక్తులు చిక్కుకుపోయారు. వారికి ధైర్యం చెప్పి, వారిని క్షేమంగా బయటకు తీసుకు వచ్చి, వైద్య పరీక్ష కోసం వెంటనే కిమ్స్ హాస్పిటల్‌కు తరలించడం జరిగింది. ప్రస్తుతం, వారి ఆరోగ్య స్థితి నిలకడగా ఉంది. స్వయంగా పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ అజితకు, నెల్లూరు పోలీస్ సిబ్బందికి బాధితులు ఆనంద భాష్పాలతో కృతజ్ఞతలు తెలిపారు. రిస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న నైట్ రౌండ్స్ అధికారులను, రూరల్ డిఎస్పీ జి. శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది ప్రతి ఒక్కరిని ఎస్పీ అభినందించి, రివార్డులు ప్రకటించారు.

## గడ్డిలో మోటర్, త్రాగునీరు ఎలా ?

పట్టించుకోని అధికారులు



**విడవలూరు, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని దళిత కాలనీలో త్రాగునీరు మోటర్ చుట్టూ పిచ్చి మొక్కలు, గడ్డి కమ్ముకు పోయి అటుగా ప్రజలు పోవాలంటే ఎక్కడ కరెంట్ షాక్ తగులుతుందో భయభ్రాంతు లకు గురవుతున్నారు. పిచ్చిగడ్డి ఉండడంతో పలమార్లు తాగునీరు మోటర్ మరమ్మతులకు గురైన విషయం తెలిసినదే, ఈ త్రాగునీరు మోటర్ సరఫరా దళిత కాలనీ తో పాటు గ్రామ సచివాలయం కు కూడా సరఫరా అవుతుంది. పంచాయతీ అధికారులు చొరవ చూపి మోటార్ చుట్టూ ఉన్న పిచ్చి గడ్డిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం

కె.వి.ఆర్ గ్రాండ్ మినీ ఫంక్షన్ హాల్ ప్రారంభం



**నెల్లూరు, అక్టోబర్ 12, ప్రభాతవార్త-విద్య :** నెల్లూరు నగరంలోని స్టోన్ హౌస్ పేట, జలకన్య బొమ్మ దగ్గర కె.వి.ఆర్ గ్రాండ్ మినీ ఫంక్షన్ హాల్ నందు ఆదివారం ఘనంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం జరిగింది. ముందుగా కెవిఆర్ గ్రాండ్ మినీ ఫంక్షన్ హాల్‌ను టిడిపి నాయకులు ఆనం రంగ మయూర్ రెడ్డి, మామిడాల మధు, జనసేన సీనియర్ నేత నూనె మల్లికార్జున యాదవ్, విద్యావేత్త నేతాజీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శ్రీనివాస కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పొన్నాల అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని అందుబాటులో ఉండేలా ఈ ఫంక్షన్ హాల్ ను రూపొందించామన్నారు. 300 మంది సీటింగ్ కలిగిన ఫంక్షన్ హాల్ ఉందని వివాహాది శుభ కార్యాలు జరుపుకునేందుకు అనువుగా ఉందన్నారు. తమ ఫంక్షన్ హాల్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలువురు బంధుమిత్రులు పాల్గొన్నారు.

# నగర జనసేనలో యువత భారీగా చేరిక



**నెల్లూరు, అక్టోబర్ 12, ప్రభాతవార్త-విద్య :** అదివారం నగరంలోని స్థానిక 16వ డివిజన్‌లో స్థానిక నాయకులు విశ్వనాథ్ ఆధ్వర్యంలో 100 మందికి పైగా యువత జనసేన పార్టీలో చేరారు. 16వ డివిజన్ చిల్డ్రన్స్ పార్క్ ఆంజనేయ స్వామి గుడి వద్ద నిర్వహించిన ఈ చేరికల కార్యక్రమంలో జనసేన పార్టీ నెల్లూరు నగర పర్యవేక్షకులు గునుకుల కిషోర్, ఏఎంసి డైరెక్టర్ గునుకుల విజయలక్ష్మిలు పాల్గొని పార్టీలో నూతనంగా చేరినవారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన నాయకులు విశ్వనాథ్ ఆధ్వర్యంలో యువత పార్టీలో చేరడం సంతోషదాయకమన్నారు. నిత్యం డివిజన్లో సంచరిస్తుంటే కూటమి ప్రభుత్వానికి ఆకర్షితులైన ఎంతో మంది ప్రజలు జనసేన పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అందరి సహకారంతో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందరికీ అందే విధంగా పార్టీ తరఫున కృషి చేస్తామని హామీఇచ్చారు. తమ పార్టీకి ప్రజల్లో ఎంతో ఆదరణ ఉందని, పార్టీ జిల్లా పర్యవేక్షకులు వేములపాటి అజయ్ సూచనలతో గత నెల రోజులుగా చాయ్ విత్ జనసేన కార్యక్రమంతో ప్రజలతో మమేకమవుతున్నామని తెలిపారు. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారంలోకి రాగానే కోట్ల రూపాయల విలువచేసే పేదల బియ్యాన్ని పట్టుకున్నారని గుర్తుచేశారు. ఈ రేషన్ బియ్యం అక్రమ రవాణాతో కొంతమంది వ్యక్తులు లక్షల మందికి వెళ్లాల్సిన రేషన్ బియ్యాన్ని సొమ్ము చేసుకుంటున్నారని కోట్లలో మునిగి తేలాడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అవినీతి పరులను ఏరు వేస్తున్నప్పటికీ ఇంకా కొంతమంది మిగిలివున్నారని వీరిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రజల మద్దతు అవసరమన్నారు. అంచెలంచెలుగా అవినీతిని నిర్మూలించేందుకు కూటమి పెద్దలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పౌర సరఫరాల శాఖ నాదెండ్ల మనోహర్ , మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే శ్రీధరన్న అందరూ కూడా ఈ క్రిమినల్ సామ్రాజ్యాన్ని కూల్చేందుకు సిదంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా దిశా కమిటీ సభ్యురాలు మీదురు శాంతికల, 16వ డివిజన్ నాయకులు విశ్వనాథ్, సీనియర్ నాయకులు బెల్లపు సుధా మాధవ్, గుర్రం కిషోర్, వెంకటేశ్వర్లు, రమేష్, వీర మహిళలు రేఖ, కామేశ్వరి, సిటీ కమిటీ సభ్యులు సురేష్, బాలు, వర్షన్, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సు ఢీ - వ్యక్తికి గాయాలు



**ఆత్మకూరు ,అక్టోబరు12,ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలోని మున్సి పల్ బస్టాండు వద్ద ఆదివారం ఒక ఆర్టీసి బస్సు ఢీకొనడంతో గడ్డం నాగ రాజు తీవ్రంగా గాయపడ్డాడు.ఆదివారం తెల్లవారుజామున ఆత్మకూరు డిపోకు చెందిన ఆర్టీసి బస్సు ఏఎస్‌పేటకు వెళ్ళేందుకు మలుపుతిప్పే సమయంలో ప్రమాదవశాత్తు నాగరాజు ఆ బస్సుకింద పడ్డాడు. దాంతో ఆయన ఎడమకాలు నుజ్జునుజ్జు అయ్యింది. తలకుకూడా గాయాలైనాయి. చికిత్స కోసం నాగరాజును ఆత్మకూరులోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించాలని వైద్యులు సూచించారు. స్థానిక ఎస్ఐ జిలానీ ప్రమాద వివరాలనుతెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

## 14న మండల సర్వ సభ్య సమావేశం

**ఆత్మకూరు, అక్టోబరు 12, ప్రభాతవార్త** : ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం 14న జరుగుతుందని ఆత్మకూరు మండల అభివృద్ధి అధికారి తెలిపారు.మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఆత్మకూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండలాధ్యక్షులు కేతా వేణుగో పాల్‌రెడ్డి అధ్యక్షతన జగుతుందని ఎంపిడిఒ తెలిపారు. కావున మండలంలోని జడ్పీటిసి సభ్యులు, సర్పంచ్ లు, ఎంపిటిసి సభ్యులు, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఆయా శాఖాల సమాచారంతో తప్పక హాజరుకావాలని ఎంపిడిఒ కోరారు.

## ఘనంగా శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే




**కావలి, అక్టోబర్ 12, ప్రభాతవార్త:** కావలి పట్టణంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ వేడుకలు కావలి సమీపానగల ఎస్.ఎం.కె కన్వెన్షన్ నందు ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. జ్యోతి ప్రజ్వలన అనంతరం చిన్నారి మేధ శ్రీ నృత్యంతో కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డాకారపు రవి ప్రకాష్, స్రవంతి చిన్నపిల్లల వైద్యశాల వైద్య నిపుణులు డాక్టర్ సుబ్బరామయ్యలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు డిగ్రీ చదువుతున్నప్పుడే విద్యార్థులు ఉపాధి అవకాశాల గురించి ఆలోచించి స్థిరపడాలని పిలుపునిచ్చారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు లోకజ్ఞానాన్ని సంపాదించడమే కాక మానసిక ఉల్లాసం పొందవచ్చునని తెలియజేశారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడారు శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో బోధనకు ,ఉపాధి అవకాశాల సాధనకు ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు డైరెక్టర్ పి జానకి రామ్ ఫ్రెషర్స్ డే నిర్వహణకు కృషిచేసిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు కళాశాలలో నిర్వహించబడే బోధన రీతులను గత విద్యార్థులు సాధించిన విజయాల గురించి తెలియజేశారు. వివిధ సెమిస్టర్ లలో అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందించి బహుమతులను ప్రధానం చేయడం జరిగింది. విద్యార్థిని,విద్యార్థుల సాంస్కృతిక కార్యక్ర మాలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ వెంకయ్య, డైరెక్టర్లు ఎం. కొండయ్య, శివరామిరెడ్డి , నందనవనం మధుసూదన్ రావు,పి.వి.ఎస్ ప్రసాద్, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పి.హరినారపరెడ్డి, శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి మహిళ మృతి

**కావలి, అక్టోబర్12, ప్రభాతవార్త:** పురుగుల మందు తాగి అరగల వెంకమ్మ(60) మృతి చెందిన సంఘటన కావలి రూరల్ మండలం, తాళ్లపాలెం గ్రామంలో జరిగింది. కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు తాళ్లపాలెం గ్రామానికి చెందిన అరగల వెంకమ్మ గత కొన్ని సంవత్సరంల నుండి అనారోగ్యంతో బాధప డుతూ, ఆ బాధలు భరించలేక శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేనీ సమయంలో పొలానికి కొట్టే గడ్డిమందు తాగినట్లు తెలియజేశారు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తము కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తీసుకుని వెళ్లడం జరిగిందని తెలియజేశారు. డాక్టర్ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తీసుకొని వెళ్లాలని చెప్పడం జరిగిందన్నారు. వెంకమ్మను మెరుగైన వైద్యం నిమిత్తము ఆదివారం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించడం జరిగిందని తెలియజేశారు.ఆమె గడ్డి మందు విష ప్రభావం వలన చికిత్స పొం దుతూ మృతి చెందడం జరిగిందని తెలియజేశారు. మృతురాలు వెంకమ్మ భర్త చిన్నవెంకయ్య కావలి రూరల్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయడం జరిగింది. ఫిర్యాదు మేరకు కావలి రూరల్ ఎస్ ఐ బాజిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు అల్పాహారం పంపిణీ



**కొడవలూరు,అక్టోబర్ 12 ప్రభాతవార్త:** మండలం నార్త్ రాజుపాలెం వినాయక గిరిజన కాలనీలో 4 పూరి గుడిసెలు షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైన బాధ్యత కుటుంబ సభ్యులకు టిడిపి మండల యువ నాయకులు బండి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బాధితులకు ఆదివారం ఉదయం అల్పాహారంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే ఆదేశాలతో శనివారం రాత్రి హైస్కూల్లో బాధ్యతులకు భోజన సదుపాయం కల్పించడం జరిగింది. ఎప్పటికప్పుడు వారి బాగోగులు తెలుసుకుంటూ సదుపాయాలు కల్పించామన్నారు. అనంతరం బండి కిరణ్, మురళి వారి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## సాంప్రదాయ బద్ధంగా పూజలు



**కోవూరు అక్టోబర్ 12 ప్రభాతవార్త** మండలం పోతిరెడ్డి పాలెం గ్రామంలో ఆదివారం. యాదవ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో పోలేరమ్మ జాతర మహోత్సవం నేత్రపరంగా అంగరంగ వైభవంగా సాగింది. సాంప్ర దాయంగా భక్తిశ్రద్ధలతో. మేళ తాళాలు మంగళ వాయిద్యాల మధ్య పోలేరమ్మ ఆలయ వద్దకు భక్తిశ్రద్ధలతో చేరుకున్నారు.

## ఆరోగ్య సేవల బంద్ విషయంపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

**బిట్రగుంట అక్టోబర్ 12 ప్రభాతవార్త:** రాష్ట్రములోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ (ఎన్ టి.ఆర్ వైద్య సేవ) సేవలను పునరుద్ధరించడానికి ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని రాష్ట్ర ప్రజారోగ్యవేదిక అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు డాక్టర్ ఎంవి. రమణయ్య, కామేశ్వరరావులు ముఖ్యమంత్రి చంద్రబా బునా యుడు కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం వారు ముఖ్యమంత్రికి వినతిపత్రం పంపారు.రాష్ట్రము లోని పౌరులందరికి, ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు ఆరోగ్యం అందుబాటు కొరకు ఆరోగ్య సంరక్షణకు అంకితమై పనిచేస్తున్న సంస్థ ప్రజా ఆరోగ్య వేదిక . అవసరమైన వారికి నగదు రహిత చికిత్స అందించడంలో కీలకమైన ఆరోగ్యశ్రీ (ఎన్‌టిఆర్ వైద్య సేవ) పథకాన్ని ప్రజారోగ్య వేదిక నిశితంగా పర్యవేక్షిస్తోందని.ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులలో ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశ) నిర్ణయం ప్రకారం ఈ పథకం కింద అందిస్తున్న అన్ని సేవలను రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 10 నుంచి నిలిపివేయడం పట్ల తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తునమన్నారు. ఆసుపత్రులు మరియు ప్రభుత్వం మధ్య పరిష్కారం కాని సమస్యల నుండి ఉత్పన్నమయ్యే ఈ అంతరాయం రోగులను, ముఖ్యంగా ముందుగా నిర్ణయించిన విధానాలు,ప్రణాళికాబద్ధమైన శస్త్రచికిత్సలు చేయించుకోవలసిన వారిని తీవ్రంగా ఇబ్బంది పెడు తుంది. ఇది గణనీయమైన ఆరోగ్య ప్రమాదాలకు దారితీస్తుంది. ఆశ డాక్టర్ల డిమాండ్ చాలా వాస్తవ మైనది. 2700 కోట్ల రూపాయల బకాయిల తో వైద్య సేవలు కొనసాగించడం చాలా భారంగా ఉంటుంది. ఈ వైద్య సేవల అంతరాయం సాధారణ ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతుంది. రోగుల ఆరోగ్య హక్కులకు కట్టుబడి వున్న వేదికగా ఈ సమస్యను పరిష్కరించడానికి తక్షణమే జోక్యం చేసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఈ విషయం అత్యవసరంగా పరిగణలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి కి పంపిన విజ్ఞాపనపత్రం లో వారు కోరారు

## నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవు



**కావలి, అక్టోబర్ 12, ప్రభాతవార్త:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలలు సెలవు దినా లలో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కావలి మండలం విద్యాశాఖాధికారి బండి గోవిందయ్య ప్రైవేట్ పాఠశాలలకు హెచ్చరికలు చేశారు. కావలి పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం సెలవు దినం అయినా కూడా తరగతులు నిర్వహించడం జరి గింది. పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను బండి గోవిందయ్య సందర్శించి ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించుటకు ప్రయత్నం చేసిన విద్యాసంస్థల నుండి విద్యార్థులను ఇంటికి పం పివేయడం జరిగింది.భవిష్యత్తులో నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాలలో తరగతులు నిర్వహించి నట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## టిట్కో ఇళ్ళ చుట్టూ ఉన్న ప్లాస్టిక్ తరహా పొడిని తొలగించాలి



**కావలి, అక్టోబర్ 12, ప్రభాతవార్త:** కావలి మద్దూరు పాడు టిట్కో ఇళ్ల చుట్టూ పేరుకుపోయిన బయో మైనింగ్ ప్లాస్టిక్ తరహా పొడిని తొలగించి అక్కడి ప్రజల సమస్యలను తీర్చాలని సిపిఎం పార్టీ పట్టణ కార్య దర్శి పసుపులేటి పెంచలయ్య అధికారులను కోరారు.సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం టిట్కో ఇళ్లనుసందర్శించి అక్కడ ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. అక్కడ ప్రజలు సిపిఎం నాయకులకు అనేక సమస్యలను తెలియజేయడం జరిగింది.ముఖ్యంగా కంపోస్టు యార్డులో ఉన్న బయో మైనింగ్ ప్లాస్టిక్ తరహా పొడిని ఇళ్ల చుట్టూ తోలుతున్నారని ఈ పొడి నల్లగా ఉన్నదని దురవాసన వస్తున్నదని తెలియజేశారు.వీటితోపాటు గాజుపెంకులు,ఇనప శీలలు,సిరంజలు రకరకాలు ఉన్నాయని వీటి వలన ఇల్ల చుట్టూ తిరిగే పరిస్థితి లేదని దురావాసనతో ఇబ్బందులు పడుతున్నామని తెలియజేశారు. ఈ ప్లాస్టిక్ పొడిని ఇక్కడ వెయ్యవద్దని వేసేవారికి చెబుతున్నప్పటికీ వినిపించుకోకుండా తోలుతున్నారని తెలి పారు.వర్షం పడినప్పుడు ఈ నల్లటి మట్టి రోడ్డుపై చేరి నందున తిరిగేందుకు ఇబ్బందులు ఉన్నాయని ఇళ్ల చుట్టూ ఇలాంటి ప్లాస్టిక్ పొడిని తోలటం ఇదే చూస్తున్నామని తెలియజేశారు. గ్రావెల్ మట్టి తోలకుండా ఇలాంటి పొడిని తోలి నందున ఇబ్బందులు పడుతున్నామని, ఇక్కడ సమస్యలు పరిష్కరించకుండా ప్రజ లను ఇబ్బందులు పెడుతున్నారని తెలియజేశారు. ఇంకా మరికొన్ని సమస్యలను సిపిఎం నాయకుల దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడారు ఇలాంటి ప్లాస్టిక్ పొడి ఇళ్ల చుట్టూ తోలి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం చాలా అన్యాయమని అధికారులు ఇక్కడ ఉన్న సమస్యలను పరిష్కరించాల్సింది పోయి ప్రజలను ఇంకా ఇబ్బందులకు గురి చేయడం మంచిది కాదని ఇక్కడ ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళతామని ఇక్కడ ప్రజలు కూడా సమస్యల పరిష్కారం కొరకు ఐక్యంగా నిలబడి సమస్యలు పరిష్కరించుకోవాలని సిపిఎం పార్టీ ఎప్పుడు మీకు అండగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి మధుసూదన్ రావు, ఎం. రమణయ్య ,మాల కొండయ్య అక్కడి ప్రజలుపాల్గొన్నారు.

## ఘనంగా కావలి మండల యు.టి.యఫ్ మహాసభ



**కావలి,అక్టోబర్ 12, ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాల నందు ఆదివారం యు టిఎఫ్ కావలి రూరల్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల మహాసభను ఘనంగా నిర్వహించడం జరిగిం ది.యు. టి. యఫ్ అధ్యక్షులు యస్. కె ముజీబ్ అహ్మద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా వారి విధానాలల్లో మార్పులేదన్నారు. యు.టి.యఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారి. వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు వి. వి శేషులు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు బి. శ్రీదేవిలు మాట్లాడారు యు.టి.యఫ్ నిర్మాణం, లక్ష్యయాలు, సిద్ధాంతాలు, క్రమశిక్షణ,పూర్వీకుల త్యాగాలు,సమస్యల పట్ల పోరాట పటిమ ల తో, బలమైన పునాదులతో పార్టీ ఏదైనా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ముందు చూపుతో వెల్తోంది అని అన్నా రు. ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆకాంక్ష లకు అనుగుణంగా ఈ ప్రభుత్వం పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల రణభేరి, యాప్ ల భారం, టెట్ తప్పనిసరిగా ఉత్తీర్ణత ఉండాలనడంతో ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడి కి గురౌతున్నారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాలు తెచ్చే మార్పుల వలన ఎవరికీ ప్రయోజనం లేకుండా విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేవిధంగా ఉన్నాయని శ్లాఘించారు. ప్రభుత్వాలు మా రుతున్నా పాతసమస్యలు పరిష్కారం కాకుండా నే క్రొత్త సమస్యలను సృష్టిస్తున్నారని సమస్యల పరిష్కారం కోసం సంఘటితం కావాలన్నారు.నవంబరు మొదటి వారం నుండి యు.టి.యఫ్ చే ఉద్యమం ఉధృతం చేయనున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయనేతలపై పెట్టిన కేసులన్నింటినీ భేషరతుగా ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. మహిళా బ్యాగ్ లను డొనేట్ చేసిన సి. ఆర్. యం లక్ష్మి, భోజనాలకు ఐదువేల వితరణవచేసిన పి. చెన్నక్రిష్ణయ్యను, ఉచితంగా ఆడిటోరియం అందించిన శ్రీసాయి డిగ్రీ కళాశాల యాజమాన్యం ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో యు టి ఎఫ్ సీనియర్ నేత శ్రీహరి, జి. వేణుగోపాల్, సి. ఆర్. యం లక్ష్మి, పి. చెన్నక్రిష్ణయ్య,జిల్లా కార్యదర్శి బి. మాధవరావు, యు. టి. యఫ్ సీనియర్ నేతలు పి. మాధవ, సత్యనారాయణ, తోట. వెంకటేశ్వర్లు, ఐ. వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. అధిక సంఖ్యలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సమస్యలపైన త్వరలో భేటీ

**బిట్రగుంట అక్టోబర్ 12 ప్రభాతవార్త** ఇతర రాష్ట్రాల నుండి మత్స్యకారులు వేటకువచ్చి సముద్రాసంపదను దోచుకోకుండా నిరోధించేందుకు జువ్వలదిన్నె హార్బర్ నందు సుమారు 100 గ్రామాలకు పైగా గ్రామకాపులతో సమావేశం ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికారయంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఇటీవలకాలంలో తమిళనాడు కు చెందిన బోట్లు ఇక్కడికి రావడం ఇక్కడ గ్రామకాపులు వాటిని బంధించడం దీనివల్ల శాంతిభద్రతల సమస్య తలఎత్తడంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.. అందులో భాగంగా ఈ నెల రెండవ వారంలో సమావేశం ఏర్పాటు చేసేందుకు అధికారయంత్రాంగం సిద్ధమవుతోంది. సమావేశం ఏర్పాటుకు సంబంధించి ఆదివారం కావలి డిఎస్పి శ్రీధర్, రూరల్ సిఐ పాపారావు, బిట్రగుంట ఎస్ఐ ప్రభాకర్ జువ్వలదిన్నె షిప్పింగ్హార్బర్ ప్రదేశాన్ని పరిశీలన చేశారు.

## టపాసుల విక్రయాలకు అనుమతులు తప్పనిసరి: ఎస్సై కుమార్



**దగదర్తి, అక్టోబర్ 12, ప్రభాతవార్త** మండలంలో దీపావళి పండుగ సందర్భంగా టపాసుల విక్రయదారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్సై జంపని కుమార్ తెలిపారు. ఆదివారం ఇందుకు సంబంధించి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్సై జంపని కుమార్ విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. టపాసులు విక్రయించే దుకాణ దారులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని,అనుమతి లేకుం డా విక్రయిస్తే అట్టి దుకాణాలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుం దని హెచ్చరించారు. టపాసులు విక్రయించే దుకాణాలు ఊరికి బయట ఉండేలా చూసుకోవాలని తెలియజేశారు.

## కండలేరులో 59.670 టీయంసీల నీటిమట్టం



**కండలేరుడ్యాం(రాపూరు), అక్టోబరు12ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జలాశయంలో ఆదివారం ఉదయం నాటికి జలాశయంలో 59.670 టీయంసీల నీటిమట్టం నమోదు అయినట్లు కండలేరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.అనీల్ కుమార్‌తెలిపారు. సోమశిల కండలేరు వరద కాలువ ద్వారా జలాశయంలోకి 3400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుండగా ,జలాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 1960 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుండి 200 క్యూసెకు,లో లెవల్ స్లూయిస్ ద్వారా 40 క్యూసెక్కుల చొప్పున మొత్తం 2200 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం




**నెల్లూరు, అక్టోబర్ 12, ప్రభాతవార్త** -వైద్యం రక్తదానం మరొకరి ప్రాణదానంతో సమానమని సింహపురి దేహసమర్పణ కన్వీనర్ పి.విజయ తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు కొత్తూరు సమీపంలో ఎల్‌బీఎస్‌నగర్‌లో ఆదివారం ఎల్‌బీ ఎస్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పి.విజయ మాట్లాడుతూ నేత్రదానం , రక్తదానం అవయవ దానం చేయడంపై అవగా హన కల్పించారు. యువకులు రక్తదానం చేయ డం వారి ఆరోగ్యానికి ఎంతో మంచిదని తెలి పారు. అలాగే నేత్రదానం చేయడంతో చూపు లేనటువంటి వారికి చూపు కల్పించిన వారు అవుతారని తెలిపారు. అవయవదానం చేయడంతో వారిని జీవితాంతం గుర్తుంచుకోవడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీఎస్ నగర్ అసోసియేసన్ నాయకులు పాల్గొన్నారు.

## అనారోగ్య చిన్నారులకి పౌష్ఠిక ఆహారం పంపిణి




**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 12, ప్రభాతవార్త** హెవీడోస్ మందులు వాడుతున్న 300 మంది వ్యాధిగ్రస్త పిల్లలకి నెలకి సరి పడా పౌష్ఠిక ఆహారాన్ని అబైడింగ్ హోప్ చర్చ్ నిర్వాహకులు, పూర్వ సర్వోదయ లెక్చరర్ టైటస్ నిర్మల్ కుమార్ అధ్వర్యంలో పంపిణీ చేశారు. శనివారం నగరంలోని స్థానిక అబైండింగ్ చర్చిలో నిర్వ హించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుణుకుల కిషోర్, ఆయన సతీమణి నెల్లూరు ఏఎంసి డైరెక్టర్ విజయలక్ష్మిలు పాల్గొని పంపిణి చేసారు.ఈ సందర్భగా వారు మాట్లడుతూ దాదాపు మూడు సంవత్సరాల నుంచి వ్యాధి పీడిత పిల్లలకు హెవీడోస్ మందులు ఇస్తు న్నందున అవి తట్టుకునేందుకు న్యూట్రిషన్ ఫుడ్ సప్లై చేయాలి అనే సంకల్పంతో ప్రతినెలా దాదాపు 300 నుంచి 500 మంది పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్ సప్లై చేస్తున్న నిర్మల్‌కి దన్యవాదాలు తెలిపారు. ఇటువంటి మహత్తర కార్యక్రమాన్ని ముందుకు నడిపించాలంటే ఎంతో సామర్థం కావాలని, ఇంటర్మీడియట్ చదివే రోజుల్లో ఊహ తెలిసే రోజుల్లో ప్రతి మనిషిని ప్రేమగా ఆప్యాయంగా పలకరించటమే కాక స్టూడెంట్స్‌కి ఎంతమందికో సహాయ సహకారాలు అందించిన నిర్మల్ కుమార్ ఆదర్శాన్ని నేడు తాము ముందుకు తిసు కువెళ్తామన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలని ప్రభుత్వ చేపట్టాలి అనేది నిర్మల్ సంకల్పమన్నారు. దీ నిని ముందుకి తీసుకువెళ్లడంలో బాగంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెళ్ల మనోహర్ తమ పార్టీ జిల్లా పర్యవేక్షకులు వేములపాటి అజయ్ కుమార్ ,జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లలతో ఈ విషయాన్ని ఇప్ప టికే పలుమార్లు చర్చించడం జరిగిందన్నారు. ఇబ్బందుల్లో ఉన్న ఆర్తులను ఆదుకోవడమే పవన్ కళ్యాణ్ లక్ష్యం అని తెలిపారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టేలా చేసేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘ నాయకులు జయప్రకాశ్, అలేఖ్య, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆఫీసు ప్రారంభోత్సవం



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 12, ప్రభాత వార్త:** కోటమిట్ట ప్రాంతంలో 42వ వార్డు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర కాం గ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి ఆది వారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా సిటీ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 42 వార్డు పార్టీ ఇం చార్జ్ షేక్ అల్లాబక్షు ఇర్ఫాన్ ఆధ్వర్యంలో పార్టీ ఆఫీస్ ఏర్పాటు చేయడం సంతో షంగా ఉందని, మైనార్టీలకు అన్ని వర్గాల ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ విజయ దందుబి మోగిస్తుందని అన్నారు. వైసిపి, టిడిపి, బిజెపి చేతిలో కీలుబొమ్మలని, వారి పాలనలో ప్రజలను వంచిస్తున్నారని మస్తాన్‌వలి అన్నారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా రాష్ట్రంలో సంతకాల సేకరణ జరుగుతుందని, 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సమాచార హక్కు చట్టం బిజెపి ఆధ్వర్యంలోని మోడీ ప్రభుత్వం వ్యవస్థలను, సంస్థలను నిర్వీర్యం చేశారని కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. పేద ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి అండదండల అందించాలని వార్డ్ ఇంచార్జ్ ఇర్ఫాన్ కోరారు. సిటీ ఉపాధ్యక్షుడు కే సంజయ్ కుమార్, జనరల్ సెక్రెటరీ అడ్వకేట్ సుధీర్, మైనార్టీ అధ్యక్షుడు రెహమాన్, రూరల్ మల్లికార్జున్ రెడ్డి, అజావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధ విహార నందు ధమ్మ ప్రవచన ప్రబోధ కార్యక్రమం



**కావలి, అక్టోబర్ 12, ప్రభాతవార్త:** కావలి, అంబేద్కర్ నగర్ లోని బుద్ధ విహార్ నందు బుద్ధ, దమ్మ మరియు సంఘం స్వీకరణ అనంతరం దమ్మ ప్రవచన ప్రబోధకార్యక్రమం ఆదివారం జరిగింది. బౌద్ధ సూత్రం పఠన సాధన కార్యక్రమం తదుపరి ద్నమ్మ ప్రవచనం ఒకటవ అధ్యాయం ఒకటో భాగం 13 అంశం సిద్ధార్థునికి శాక్యయ సంఘంలో సభ్యత్వం తదితర అంశాలను బౌద్ధచార్యులు సంఘ జ్యోతి ప్రబోధించడం జరిగింది. సంఘ ప్రవచనాన్ని పూజల జయ ప్రకాష్ (జెపి) తెలియజేశారు. జనపదం ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో విహార్ ఉపాసక, ఉపాసికులకు న్యూట్రిషన్ అందజేయడంజరిగింది. ఉపాసిక, ఉపాసకులు కావలి జీవన్ బోధి, ఉదయ్ భాస్కర్, సిహెచ్ వంశీ బోధి, మదన్ బోధి, సన్నీ బోధి, పూజల మమత విహార్ విద్యార్థులు పాల్గొన్నారు.

## కాళికా రూపంలో అంకమ్మ తల్లికి



**విడవలూరు, అక్టోబర్ 12ప్రభాత వార్త** : గ్రామ దేవతగా వెలసియున్న శ్రీ అంకమ్మ తల్లికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉద యం అభిషేకాలు,కుంకుమ అర్చన, అర్చకులు కొర్నాగిరి ఆధ్వర్యంలో నిర్వ హించారు. అమ్మవారికి వివిధ రకాల అలంకరణ చేయడంతో భక్తులకు కాళికా రూపంలో దర్శనమిచ్చారు పల్లకిలో అమ్మవారిని ఆలయ ప్రాం గణంలో పల్లకి సేవ చేశారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీక రించారు. అంతకముందు భజన భక్తమండలి వారిచే భక్తి గీతాలు ఆలపిం చారు.ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఆలయ సేవకులు వ్యవకరించారు.

## అంకమ్మతల్లి దర్శనానానికి పెద్ద ఎత్తున భక్తులు



**వెపినాపి(రాపూరు), అక్టోబరు12ప్రభాతవార్త** మండలంలోని వెపినాపి గ్రామ దేవతైన పోతుకొండ అంకమ్మ తల్లి దర్శించు కునేందుకు ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు అంకమ్మ కొండకు చేరుకున్నారు. భక్తులు భక్తితో ప్రార్థిస్తే కోరిన కోరికలు నేర వేర్చే కల్పవల్లిగా వీరాజిల్లుతున్న అంకమ్మ తల్లిని దర్శించు కునేందుకు రాపూరు మండలం నుండే కాక జిల్లాలోని ఇతర మండలాల నుండి కూడా పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు ఆలయ అర్చక స్వాములు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## గోనుపల్లిలో మృతురాలి కుటుంబానికి ఆర్థిక చేయూత



**గోనుపల్లి(రాపూరు), అక్టోబరు12ప్రభాతవార్త** మం డలంలోని గోనుపల్లి గ్రామంలోని గిరిజన కాల నీలో ఆదివారం మృతి చెందిన యాకసిరి వెం కట రమణమ్మ కుటుంటుం బానికి గ్రామానికి చెం దిన తెలుగుదేశం పార్టీ నాయకుడు ఈగా రాజా రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. వెంకటరమ ణ మ్మ మృతి చెంది న విషయాన్ని తెలుసుకున్న రా జా రెడ్డి మృతురాలి నివాసానికి వెళ్లి ఆమె భౌతిక కా యాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళు లర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కర్మకాండల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు రూ.5 వేల నగదు సాయం చేశారు. గ్రామంలో పేదలు మరణిస్తే వారి కర్మకాండలకు రాజా రెడ్డి తన సొంత నిధుల నుండి రూ.5వేల నగదు సాయం అందిస్తున్నారు. నిరుపేదలైన వారికి రాజారెడ్డి చేస్తున్న సాయం పట్ల మండలంలోని పలువురు రాజారెడ్డి ఔదార్యాన్ని ప్రశంశిస్తున్నారు.

## మాలేపాటిని పరామర్శించిన బి.ఎం.ఆర్



**కావలి, అక్టోబర్ 12, ప్రభాతవార్త:** ఇ టీవల అస్వస్థతకు గురై విజయవాడలో ని మణిపాల్ హాస్పిటల్ నందు శస్త్ర చికి త్స చేయించుకుని హాస్పిటల్ లో ఉన్న కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మాజీ ఇంచార్జ్,రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవ లప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ని రాజ్యసభ సభ్యులు, బీద మస్తాన్ రావు యాదవ్ ఆదివారం హాస్పిటల్‌కి వెళ్లి పరామర్శించి యోగ క్షేమా లను ఆయన అన్న మాలేపాటి రవీంద్రనాయుడుని అడిగి తెలుసుకోవడం జరిగింది. సుబ్బానాయుడు ఆరోగ్య పరిస్థితి పై వైద్యులతో మాట్లాడి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పడం జరిగింది. మాలేపాటి భగవంతుని ఆశీస్సులతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఇటువంటి స్థితిలో మాలేపాటిని చూస్తానని అనుకోలేదు



**కావలి, అక్టోబర్ 12, ప్రభాతవార్త:** ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడుని చూస్తామని అనుకోలేదని ఉదయగిరి మాజీ శాసనసభ్యులు బొల్లినేని రామారావు తెలియజేశారు. ఇటీవల అస్వస్థతకు గురై వైద్యశాలలో చికిత్స పొందుతున్న మాలేపాటిని ఆదివారం ఉదయగిరి మాజీ శాసన సభ్యులు బొల్లినేని రామారావు విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్ కు వెళ్లి పరామర్శించడం జరిగింది. వెంటిలేటర్ పై ఉన్న ఆయనను చూసి తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. కావలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ప్రాణం పోసిన వ్యక్తిని ఈ స్థితిలో చూస్తానని అనుకోలేదని వారి కుటుంబ సభ్యులతో ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఏదేమైనా ఆ భగవంతుని కరుణతో ఆయన త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా వేడుకున్నారు.

## గిరిజనులకు నిత్యవసర సరుకులు పంపిణీ

### - దాసరి పోలయ్య - కోవూరు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు



**కొడవలూరు, అక్టోబర్ 12 ప్రభాత వార్త:** మండలంలోని నార్త్ రాజుపాలెం వినాయక గిరిజన కాలనీలో దురదృష్ట శాతం షార్ట్ సర్క్యూట్ తో నాలుగు పూరిగుడిసెలు అగ్నికి ఆహుతి అయినాయి. గిరిజన సమస్యను తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని బాధ్యతులను పరామర్శించి వెంటనే నిత్యవసర సరుకులతో పాటు ఆర్థిక సహాయం చేయడం సంతోషకరమైన విషయమని జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ నెంబర్ దాసరి పోలయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల కోసం అన్ని విధాలుగా కోవూరు ఎమ్మెల్యే సహాయక సహకారాలు అందించడం ఇలాంటి ఎమ్మెల్యేను చూడబోమని కొనియాడారు. అదేవిధంగా బాధ్యతకుటుంబాలకు జిల్లా అధికారులతో మాట్లాడి పక్కాఇల్లు నిర్మిస్తామన్నారు. బాధ్యత కుటుంబాలకు ధైర్యం చెప్పి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. బాధ్యత కుటుంబ సభ్యులు, గిరిజన నాయకులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విడవలూరు, నెల్లూరు టిడిపి ఎస్టి నాయకులు కొమరగిరి దయాకర్, ఏకశిరి లోకేష్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా మినీ వాటర్ ట్యాంకులు



**విడవలూరు, అక్టోబర్ 12 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మినీ వాటర్ ట్యాంకులు లేక దళిత కాలనీలలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు గ్రామసభల సమావేశాల్లో ప్రజలు అధికారులకు తెలిపిన ఆ క్షణం వరకు తప్పనిసరిగా ఏర్పాటు చేస్తామని మాటల చెప్పి కప్పిపుచ్చుకుంటారే తప్ప చేతల్లో పనిలేదని ప్రజలు ఆరోపించారు. దళిత కాలనీలలో త్రాగునీరు నిల్వ ఉండేందుకు వాటర్ మినీ ట్యాంకులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలలో త్రాగునీరు సరఫరాకు మోటర్లు ఉంటే అవి కాస్త విద్యుత్ సరఫరా ఉంటేనే త్రాగునీరు వస్తాయి. దీనికితోడు ఉన్న మోటర్లు మరమ్మతులకు గురవుతాయి ఆ సమయంలో త్రాగునీటి కోసం కష్టాలు తప్పవని స్థానిక ప్రజలు వాపోయారు. సచివాలయంలో మూడు మినీ ట్యాంకులు నిరుపయోగంగానే ఉంచారేతప్ప వాటిని అవసరమైన దళిత కాలనీలలో ఏర్పాటు చేయకపోవడం పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పై అధికారులు దళిత కాలనీలో తాగునీరు నిల్వ ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కోవూరు చెరువుపై 'విజిలెన్స్'



**కోవూరు, అక్టోబరు 12 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో ప్రధాన చెరువైన కోవూరు చెరువుపై ఇటీవల విజిలెన్స్ అధికారులు నిశిత పరిశీలన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు గతంలో ఈ చెరువు వైశాల్యం ఎంత.. ప్రస్తుతం ఎంత ఉంది.. ఎంతమేర ఆక్రమణలకు గురైంది అనే వివరాలను విజిలెన్స్ అధికార బృందం సభ్యులు పరిశీలన చేపట్టి నివేదికను తయారు చేసుకున్నారు. గతంలో కోవూరు చెరువుగా ఉన్న ఈ ప్రాంతం ప్రస్తుతం అధిక శాతం మంది ఆక్రమించుకుని పొలాలుగా సాగు చేసుకుంటున్న నేపథ్యంలో విజిలెన్స్ పరిశీలన చేపట్టడం లోతట్టు సాగుదారుల్లో ఆందోళన బయలుదేరింది. మొత్తం 232 మంది లోతట్టుదారులు చెరువును ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నట్లు విజిలెన్స్ బృందం పరిశీలనలో వెల్లడైంది. దీనికి తోడు కోవూరు చెరువులో విద్యుత్ శాఖ స్తంభాలు ఏర్పాటు చేసి సాగుదారులకు విద్యుత్ సరఫరా కూడా ఇవ్వడం జరిగింది. దీనిని కూడా విజిలెన్స్ అధికారులు తమ పరిశీలనలో నివేదికలో పొందుపరిచారు. మొత్తం మీద ఇంత కాలానికి కోవూరు చెరువుపై విజిలెన్స్ చూపు పెట్టడం పట్ల లోతట్టుదారుల్లో ఆందోళన చెలరేగింది.

## బాణాసంచా విక్రయాలకు అనుమతులు తీసుకోవాలి



**కావలి, అక్టోబర్ 12, ప్రభాతవార్త:** కావలి రూరల్ మండలం లోని బాణాసంచా విక్రయాలు, నిల్వలు తయారీకి సంబంధించి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవలెనని కావలిరూరల్ ఇన్స్పెక్టర్ జిరాజేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు నెల్లూరు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల ప్రకారం కావలి రూరల్,మండలంలోని వ్యాపారస్తులు పోలీస్ ,రెవిన్యూ, అగ్నిమాపక శాఖల అనుమతులు పొందిన తర్వాతే బాణాసంచా విక్రయాలు కొనసాగించవలెనన్నారు. అనుమతులు పొందిన షాపులు జనసంచారం తక్కువగా ఉండే విశాలమైన ప్రదేశాలలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అగ్నిమాపక ప్రమాదాలు నివారించేందుకు ప్రతి దుకాణం వద్ద నీటి డ్రమ్ములు ,పొడి ఇసుక, అగ్నిమాపక పరికరాలు ఉంచుకోవలెనన్నారు . అనుమతులు లేకుండా బాణాసంచ విక్రయించిన, నిల్వచేసిన, తయారు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడునన్నారు . కావలి రూరల్,మండల పరిధిలో ఎక్కడైనా బాణాసంచా విక్రయాలు అక్రమంగా చేసిన లేదా తయారుచేసిన లేదా నిల్వచేసిన వారిని గుర్తిస్తే వెంటనే స్థానిక పోలీసులకు గాని లేదా డయల్ 112 కు గాని సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకోబడును. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడునని తెలియజేశారు .

# అందరి ఇల్లు - అందరికోసం







**బుచ్చి అక్టోబర్ 12 ప్రభాతవార్త** దైవభక్తి పేద ప్రజలకు ఏదో చేయ్యాలన్న తపన మానవసేయే మాదవసేవ అని తలచే మంచి మనిషి తన సతీమణి దివంగత తిరివీధి లక్ష్మీకాంతమ్మ పేరుతో చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశాడు. ప్రతి సంవత్సరం ఏదో ఒకటి చేస్తుంటారు ఆయనే తిరివీధి రాధాకృష్ణయ్య. బుచ్చిరెడ్డిపాళెం ఎస్ఎస్ కళ్యాణ మండపం అధినేత తిరివీధి రాధాకృష్ణయ్య బుచ్చిరెడ్డిపాళెంలోని సంస్వతీ నగర్‌లో తన సొంత నిధులతో అందరి ఇల్లు- అందరి కోసం అని ఒక భవనాన్ని ఏర్పాటు చేశారు.ఈ భవనాన్ని 16 వ తేది రాత్రి 8.30 నిమిషాలకు తాత్కాలికంగా పాలు పొంగిస్తున్నారు. దీనిని నిర్మాణం చేయడం యొక్క ఆశయం బుచిరెడ్డిపాళెంకి హాస్పటల్‌లో ఉండే రోగుల యొక్క బందుమిత్రులను పరామర్శించేందుకు వచ్చే వారికి, బంధువర్గంలో జరుగు అంత్యక్రియలకు వచ్చు వారికి, ఇంట్లో నలతగా ఉన్న పెద్దల విశ్రాంతికి ఈ భవనం ఎంతో ఉపయోగ పడుతుంది.ఈ భవనంలో 2 రోజులు ఉండేందుకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు. ఈభవనంలో కి వచ్చే వారికి తప్పకుండా ఆధార్‌కార్డు అవసరం. ఇక్కడ భోజనం కూడా శాఖాహారం మాత్రమే పెట్టడం జరుగుతుందని రాధయ్య తెలిపారు. ధనిక,పేద ,విచక్షణ లేకుండా అధికార,అనదికార విచక్షణ లేకుండా కులమతాలకు అతీతంగా సేవలు అందించడం జరుగుతుంది.ఈ భవనం విషయం తెలిసి పలువురు ఆయనను అభినందిస్తున్నారు. నవంబర్ నెలలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చేతుల మీదుగా ఈ భవనాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. అయితే నిత్యం ఉచిత బోజనాలకు, అక్కడ పనిచేసే సిబ్బంది జీతాలకు దాతల ద్వారా శాశ్విత నిధిని ఏర్పాటు చేసి దానిపైన వచ్చే వడ్డీతో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## సోలార్‌పై వినియోగదారులు మరింత అవగాహన చేసుకోవాలి



**కోవూరు, అక్టోబరు 12 ప్రభాతవార్త:** ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకంపై విద్యుత్ వినియోగదారులు పూర్తిస్థాయిలో అ వగాహన చేసుకోవాలని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రమేష్ చౌదరి తెలిపారు. కోవూరులోని నేతాజీ నగర్‌లో ఉన్న ట్రాన్స్‌కో ఎగ్జిక్యూ టివ్ కార్యాలయంలో మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసు కుంటే ప్రభుత్వం కూడా సబ్సిడీ నిధులు అందజేస్తుందన్నారు. దీనిని ఏర్పాటు చేసుకోవడం వలన వినియోగదారుడు బిల్లుల్లో పూర్తిగా కట్ట వలసిన అమౌంట్ తగ్గి తిరిగి వినియోగదారునికే నిధులు మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ పథకంపై విద్యుత్ వినియోగదారులు అవగాహన చేసుకుని ఏర్పాటు చేసు కోవాలన్నారు.

## వేడుకగా 1990 బ్యాచ్ విద్యార్థుల గెట్ టూ గెదర్



**రాపూరు, అక్టోబరు12ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులో 1989..1990కి చెందిన పదవ తరగతి విద్యార్థులు గెట్ టూ గెదర్ కార్యక్రమం నిర్వహించుకోని కలుసుకున్నారు. సుమారు 60 మంది చిన్ననాటి స్నేహితులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.నాడు వారికి విద్యను భోదించిన 5 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్నేహితులు అందరూ కలసి పండరి భజన, కోలాటం, డ్యాన్స్‌లు చేసి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాదులో సీనియర్ జర్నలిస్ట్‌గా వున్న ఈస్కా రాజేష్ బాబు 2024..25 సంవత్సరంలో రాపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురికి,సివికె జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.1,116 చొప్పున ప్రోత్సాహకంగా తన సొంత నిధుల నుండి నగదు ఆందజేశారు. ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 1989..90 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు వారి కుటుంబసభ్యులు వున్నారు.

## ప్రేమతో పోషణ దీర్ఘకాలిక బాధిత పిల్లల జీవితాల్లో ఆశ దీపం వెలిగించిన అబైడింగ్ హోప్ ట్రస్ట్



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 12, ప్రభాతవార్త** మానవతా స్పూర్తిని ప్రతిబింబించే హృదయాన్ని తాకే కార్యక్రమం ఆదివారం నెల్లూరులోని కొండయపాలెం ప్రాంతంలోని అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో జరిగింది. అబైడింగ్ హోప్ ట్రస్ట్, పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్ ప్రభావిత పిల్లలకు పోషకాహార ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా 300 మంది ఎయిడ్స్ ప్రభావిత పిల్లలకు ఒక నెలకు సరిపడే పోషకాహార ప్యాకెట్లు పంపిణీ చేయబడగా, అనంతరం పిల్లలు మరియు వారి బంధువులందరికీ భోజనం వడ్డించబడింది. స్నేహపూర్వక వాతావరణంలో ప్రేమ, ఆనందం, మరియు మానవతతో నిండిన ఈ కార్యక్రమం అందరినీ హృదయానికి హత్తుకుంది. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం ఎయిడ్స్ ప్రభావిత పిల్లల ఆరోగ్యాన్ని మరియు భావోద్వేగ శ్రేయస్సును పెంపొందించడం. పిల్లలకు సమతుల్యమైన పోషకాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడం అబైడింగ్ హోప్ ట్రస్ట్ యొక్క నిరంతర మిషన్‌లో ఒక భాగం. అబైడింగ్ హోప్ ట్రస్ట్ డైరెక్టర్ డా. ఎం. టైటస్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి భోజనం ఒక ప్రేమ చర్య. ఆహారం శక్తినిస్తుంది, కానీ కరుణ ఆశను ఇస్తుంది. ప్రతి పిల్లవాడు గౌరవంగా, ఆనందంగా జీవించే సమాజాన్ని కలసికట్టుగా నిర్మిద్దాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నగర నాయకుడు కిషోర్ మాట్లాడుతూ మానవతకు సహాయం చేయడం అంటే దేవునికి సేవ చేయడం. డా. టైటస్ నిర్మల్ కుమార్ గారి దయా సేవలు ప్రశంసనీయం. ఆయన బలహీన వర్గాలపై చూపుతున్న ప్రేమ నిజమైన మానవత్వానికి ప్రతీక" అని అన్నారు. పిఆర్ఎస్ఐ సభ్యులు, ఏహెచ్‌టి స్వచ్ఛంద సేవకులు ఉత్సాహంగా పాల్గొని పిల్లలతో మాట్లాడి, పోషకాహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జయప్రకాశ్, డేవిడ్ లివింగ్‌స్టోన్, క్రాంతి, బాబు, రూత్ బినోమి, అలేఖ్య, సోదరీమణులు రమ, జయ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం పిల్లలందరికీ, వారి బంధువులకు భోజనం వడ్డించబడింది. ప్రేమ, కరుణ, మానవతతో నిండిన ఈ కార్యక్రమం అబైడింగ్ హోప్ ట్రస్ట్ యొక్క సేవా మిషన్‌ను మరింత బలపరిచింది.

## నేడు కోటి సంతకాల కార్యక్రమం



**కోవూరు అక్టోబర్ 12 ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి రాష్ట్ర వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం కోవూరులోని వైసీపీ కార్యాలయంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైసీపీ అధ్యక్షులు అత్తిపల్లి అనుప్‌రెడ్డి తెలిపారు ఈ మేరకు ఆదివారం కార్యాలయం మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి రాష్ట్ర వైసిపి పిఎసి సభ్యులు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి హాజరవుతున్నారు అన్నారు ఈ కార్యక్రమానికి వైసిపి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సీనియర్ పార్టీ నాయకులు వైసిపి అనుబంధాల సంఘాల సభ్యులు తప్పక హాజరు కావాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు

## వైభవంగా యాదవ కుటుంబ సభ్యుల జాతర





**కోవూరు అక్టోబర్ 12 ప్రభాతవార్త.** కొవ్వూరు మండలం పోతిరెడ్డి పాలెంగ్రామంలో ఆదివారం యాదవ కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ జాతర కార్యక్రమాలను సాంప్రదాయంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అమ్మవారి చిత్రాన్ని ముగ్గుతో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలను సాంప్రదాయంగా నిర్వహించారు అనంతరం పొంగళ్ళు పెట్టుకుని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమం నేత్రపర్వంగా నిర్వహించారు అమ్మవారికి సారే చీర సమర్పించి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముక్కులు తీర్చుకున్నారు ఈ కార్యక్రమంలో యాదవ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## సర్పంచ్ ను పరామర్శించిన పచ్చిపాల



**కోవూరు అక్టోబర్ 12 ప్రభాతవార్త** కొవ్వూరు మండలం మోడిగుంట గ్రామము సర్పంచ్ వెంకటరమ ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని స్వగృహానికి తిరిగి వచ్చాడు ఈ మేరకు ఆదివారం ఆయనను వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి పరామర్శించారు ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట అమర్ శేఖర్ స్వామి జగదీష్ స్వామి తదితరులు ఉన్నారు

# పల్లెల్లో చిచ్చు పెట్టొద్దయ్య.. కక్షలు, అక్రమాలతో ఓట్లు పడవు

### - మా ఎమ్మెల్యే కాకర్లను విమర్శించే స్థాయి వైసీపీ నేతలకు లేదు
### - టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు







**వరికుంటపాడు, అక్టోబర్ 12, ప్రభాతవార్త** మీ రాజకీయ అవసరాల కోసం పచ్చని పల్లెల్లో చిచ్చు పెట్టవద్దని, అలాగే మా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్‌ను విమర్శించే స్థాయి మీది కాదు.. అంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఉదయగిరి వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిలపై వరికుంటపాడు మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు విరుచుకుపడ్డారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నేతలు విలేకర్ల సమావేశం నిర్వహించి వైసీపీ నేతల మాటలపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం మండలంలోని విలువూరులో జరిగిన వైసీపీ ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిలు తమ స్థాయిని మరిచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లను విమర్శించడంపై వరికుంటపాడు తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఇష్టం వచ్చినట్లు డైలాగులు వేస్తే ఊరుకోమని, గత ప్రభుత్వ హయాంలో సర్వేపల్లిలో అరాచకాలు సృష్టించి అక్రమాలకు పాల్పడి నేడు వరికుంటపాడు మండలంలో చిచ్చు పెట్టాలని చూస్తున్నావా, మీ పాలన భాగా లేకనే వైసీపీ ఎమ్మెల్యేలు టీడీపీలో చేరారని, ఆ విషయం మర్చిపోయావా అంటూ కాకాణిపై ధ్వజమెత్తారు. కాకాణికి నెల్లూరులో పని లేకనే ఉదయగిరి వైపు పరుగులెత్తుతున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అవినీతిలో పుట్టి పెరిగిన పార్టీ వైసీపీ పార్టీ అని, కానీ తెలుగుదేశం అంటేనే అభివృద్ధి, సంక్షేమానికి అండగా ఉండే పార్టీ అని గుర్తుంచుకోవాలన్నారు. మా ఎమ్మెల్యే ఎన్ఆర్ఐ అయినప్పటికి ఉదయగిరి నియోజకవర్గంలో ట్రస్టు ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అతి తక్కువ కాలంలోనే ప్రజలకు దగ్గరయ్యారని, కానీ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ కేసులు బనాయించడంతో పాటు పాలన సరిగా లేకపోవడంతోనే ప్రజలు ఓట్లు వేయలేదు అనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. అసలు నీది ఏ ఊరు అయ్యా.. నువ్వు ఇక్కడ రాజకీయం చేయడం ఏందయ్యా.. అంటూ మేకపాటి రాజగోపాల్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. ఉదయగిరి నియోజకవర్గం సమస్యలపై నిరంతరం అసెంబ్లీలో ప్రస్తావిస్తూ, నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుంది మా కాకర్ల సురేష్ అని గుర్తుంచుకోవాలన్నారు. మా ఎమ్మెల్యే సౌమ్యుడు కాబట్టే మీ వాళ్ళు రప్పా రప్పా అంటూ విర్రవీగుతున్న ఎలాంటి కేసులు కానీ ఏమి పెట్టకుండా ఉండడంతోనే మీరు ఇలా సభలు జరుపుకుంటున్నారని విషయ మర్చిపోవద్దని హితవు పలికారు. ఇప్పటికైనా స్థాయిని మించి మాటలు మాట్లాడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు రావెళ్ల నాగేంద్ర, సొసైటీ అధ్యక్షులు గుర్రం గోపి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్ యాదవ్, తెలుగు అధ్యక్షులు ముజ్జే లక్ష్మీ నారాయణ, వైస్ ఎంపీపీ దేవునబోయిన మధు, టీడీపీ నేతలు పోక మహేష్, నాదెండ్ల రాజేంద్ర, చంద్ర వెంకయ్య, పొద మాధవ్, మానం కొండలరావు, అంద్రా గురవారెడ్డి, అంద్రా నాగిరెడ్డి, కామేపల్లి వెంకటరత్నం, గొడుగులూరి మాలకొండ రాయుడు, గంగవరపు పుల్లయ్య నాయుడు, ఆరికొండ వెంకటరత్నం, లోకసాని రవి, ఆరోన్, జనసేన మండల అధ్యక్షుడు రసూల్ పఠాన్, టీడీపీ మహిళా నేతలు ఆవుల అరుణ, మాగంటి శాంతమ్మ, వివిధ గ్రామాల నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.